

శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం
యాదాద్రిలోని శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. - 10లో



కొనుగోళ్లకు సన్నద్ధం కావాలి
యాసంగిలో ధాన్యం కొనుగోళ్లకు ఆయా శాఖల అధికారులు సిద్ధం కావాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు కోరారు. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 34°/16°
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి చలి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

17న సీపీఎం జిల్లా ప్లీనరీ

నల్లగొండ టౌన్ : సీపీఎం జిల్లా ప్లీనరీ ఈ నెల 17న ఉదయం 10 గంటలకు స్థానిక పెద్దబండలోని ఎఫ్‌సీఐ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు. సమావేశానికి జిల్లాకమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల సభ్యులు హాజరుకావాలని కోరారు.

రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్

నల్లగొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రెండు కోట్ల ఉద్యోగాలను వెంటనే ఇవ్వాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేశ్ డిమాండ్ చేశారు. నల్లగొండలో నిర్వహిస్తున్న డీవైఎఫ్‌ఐ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంల్లో రెండో రోజు బుధవారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కొత్త ఉద్యోగాలపై దృష్టి పెట్టగపోగా ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌లకు అప్పగిస్తోందని మండిపడ్డారు. యువత భవిష్యత్ ప్రణాళికలను రూపొందించడంలో కేంద్ర పభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన ఉద్యోగాల ప్రకటనలో పేర్కొన్న ఉద్యోగాన్నింటినీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మల్లం మహేష్, బషీరుద్దీన్, గడ్డం వెంకటేష్, జిన్, శివవర్మ, ప్రవీణ్, శ్రీకాంత్, నవీన్, జావీద్, తిరుపతి, రమేష్, ప్రభాకర్, గుండాల నరేష్, రమేష్, మహేష్, కార్తీక్, రాము, ప్రసాద్, సంధ్య, రేణు, మమత పాల్గొన్నారు.

తెలంగాణలో సబ్బండ కులాల వాటా ఎంత?

- డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్


మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

హాలియా : పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో సబ్బండ కులాల వాటా ఎంత అని ప్రశ్నించడానికే పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర చేపట్టినట్లు డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. ఆయన చేపట్టిన స్వరాజ్య పాదయాత్ర బుధవారం హాలియా పట్టణానికి చేరుకున్న సందర్భంగా పట్టణంలో డీఎస్పీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బలిపీఠం ఎక్కింది బీసీ, ఎస్సీ, ఎస్టీలైతే అధికార పీఠం ఎక్కింది రెడ్డి, వెలమ కులస్తులేనన్నారు. నూటికి 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఈ రాష్ట్రాన్ని పరిపాలించాలని, అట్టడుగు వర్గాలను అధికారంలోకి తీసుకువచ్చే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి రాంబాబు, నాయకులు కాకునూరి నారాయణగౌడ్, అంతయ్య యాదవ్, బాబురావు నాయక్, కట్టెబోయిన అనిల్‌కుమార్, బందిలి పెద్ద సైదులు, బాలరాజ్ యాదవ్, చెరుపల్లి ముత్యాలు, కృష్ణ, సురభి రాంబాబు, రామలింగయ్య, దుండిగల కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలి


అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

నల్లగొండ : అంగన్‌వాడీ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. బుధవారం ఆమె మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులతో అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా తన చాంబర్‌లో సమావేశమయ్యారు. పిల్లల బరువు, పోషణ, అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణపై చర్చించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి, 9 ప్రాజెక్టుల సీడీపీఓలు, ఏసీడీపీలు పాల్గొన్నారు.

- హోరాహోరీ


పెద్దవూర మండలంలోని చింతపల్లిలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో తలపడుతున్న జట్లు

- ఈవెంట్స్ ప్రారంభం


నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో బుధవారం ప్రారంభమైన పోలీస్ ఈవెంట్స్‌లో భాగంగా రన్నింగ్ చేస్తున్న అభ్యర్థులు

ఆరు ప్రాజెక్టులపై ఫోకస్

- బడ్జెట్‌లో ఇచ్చిన నిధులను వాటికే కేటాయించేలా కసరత్తు
- అవసరమైతే అదనంగా మరో రూ.300 కోట్లు కేటాయించే అవకాశం
- ఇప్పటికే రెండుసార్లు సమీక్షించిన శాసన మండలి చైర్మన్
- త్వరలో అధికారులతో మంత్రి హరీష్‌రావు, గుత్తా సమావేశం


డిండి మండలం సింగరాజుపల్లి ఎర్త్‌డ్యాం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లాలో త్వరగా పూర్తయ్యే సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. తొమ్మిది నెలల్లోగా పూర్తి చేయగలిగే ఆరు ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో చేపట్టాలని భావిస్తోంది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు దీనికి సంబంధించి ఇప్పటికే శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జిల్లా నీటిపారుదల శాఖ అధికారులతో రెండుసార్లు సమావేశమయ్యారు. త్వరలోనే హరీష్‌రావుతో చర్చించి సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం బడ్జెట్‌లో రూ.647 కోట్లు కేటాయించింది. నిర్దేశిత కాలంలో ఏయే ప్రాజెక్టులను పూర్తి చేయవచ్చో వాటికే ఆ నిధులను ఇవ్వాలన్న ఆలోచనలు చేస్తోంది.

ఏవేవి పూర్తి చేయవచ్చంటే..

- ఉదయసముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ (బ్రాహ్మణ వెల్లంల) పనులు 90 శాతం పూర్తయ్యాయి. ఇంకా కాలువల పనులతో మరికొన్ని పనులు చేయాల్సి ఉంది. వాటి భూసేకరణకు రూ.50 కోట్లు, మరో రూ.50 కోట్లు ఇతర పనులకు అవసరం ఉంది. మొత్తంగా రూ.100 కోట్లు ఇస్తే 80 వేల ఎకరాలకు సాగునీరు అందించే 40 చెరువులను నింపవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు విద్యుత్ కనెక్షన్ ఇస్తే విద్యుత్ వినియగించినా, వినియోగించకపోయినా రూ.2 కోట్లు బిల్లు చెల్లించాల్సి వస్తుంది. దానికి ఏం చేయాలన్న దానిపై ఆలోచనలు చేస్తోంది.
- పిల్లాయపల్లి, ధర్మారెడ్డి కాల్వల పూర్తి చేయడానికి మరో రూ.85 కోట్లు కేటాయిస్తే సరిపోతుందనే ఆలోచనల్లో ఉంది. ఇక ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు ఇప్పట్లో పూర్తికావనే భావనలో ఉంది. దానికి మరో రెండు మూడేళ్ల సమయం పట్టనుంది.
- మూడేళ్లుగా పాత డిండి రిజర్వాయర్ ఓవర్‌ఫ్లో అవుతోంది. దుందుబీ నది నుంచి వచ్చే వరద, కల్వకుర్తి లిఫ్ట్ నుంచి వచ్చే నీటితో నక్కల గండిని సగానికి నింపవచ్చని భావిస్తోంది. దాని పనులు ఇప్పటికే 95 శాతం పూర్తయ్యాయి. ఇంకో 5 శాతం చేస్తే పనులు పూర్తి కానున్నాయి. నక్కలగండి రిజర్వాయర్ సామర్థ్యం 7.5 టీఎంసీలు కాగా, మిగిలిన పనులను చేస్తే వరద నీటితో వచ్చే సీజన్ 4.5 టీఎంసీలను నింపుకోచవచ్చు. ఇందులో నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట ప్రాంతంలో భూసేకరణ, మూడు నాలుగు గ్రామాల్లో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాల్సి ఉంది. గేట్ల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. దానికి నిధులను ఇస్తే పూర్తి చేయవచ్చని భావిస్తోంది. అందుకు ఎంత నిధులు అవసరం అన్న దానిపై ఆలోచనలు చేస్తోంది.
- సింగరాజుపల్లి పనులు 86 శాతం పూర్తయ్యాయి. ఇంకా 14 శాతమే మిగిలి ఉన్నాయి. రూ.25 కోట్లు పెడితే వరదతోనే 0.9 టీఎంసీల కెపాసిటీ కలిగిన ప్రాజెక్టును నింపుకోవచ్చని భావిస్తోంది.
- 1.9 టీఎంసీల సామర్థ్యం కలిగిన గొట్టిముక్కల రిజర్వాయర్ కూడా సాధారణ వరదతో నింపుకోవడానికి అవకాశం ఉంది. అక్కడ 95 శాతం కంటే ఎక్కువ పనులు పూర్తయ్యాయి. ఇంకా కొన్ని చిన్న పనులు ఉన్నాయి. అవి పూర్తి చేసుకుంటే ఉపయోగమని భావిస్తోంది.
- పెండ్లిపాకల పనులు వేగంగా కొనసాగడం లేదు. అక్కడి కాంట్రాక్టర్ ఇబ్బంది పెడుతున్నారని ప్రభుత్వం భావిస్తోంది. ఆ కాంట్రాక్టు సంస్థను తొలగించి కొత్తవారికి అప్పగించే ఆలోచేన చేస్తోంది. 2.2 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలంటే రూ.600 కోట్లు అవసరం. తద్వారా 12 వేల ఎకరాల ఆయకట్టుకు ఉపయోగం. దానిపైనా దృష్టిపెట్టింది.

అవసరమైతే అదనపు నిధులు అడుగుతాం



జిల్లాలో త్వరగా పూర్తయ్యే సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ప్రస్తుతం బడ్జెట్‌లో కేటాయించిన నిధులకు తోడు అదనపు నిధులు అవసరం. దానిపై ప్రభుత్వంతో చర్చిస్తాం. సీఎం కేసీఆర్ కూడా మరో రూ.300 కోట్ల వరకు కేటాయించేందుకు సానుకూలంగా ఉన్నారు. దీనిపై ఆర్థిక మంత్రి హరీష్‌రావుతో, నీటిపారుదల శాఖ అధికారులతో త్వరలోనే సమావేశమవుతాం. సీఎం దృష్టికి తీసుకెళ్తాం. ఆయన తుది నిర్ణయం తీసుకుంటారు.
– గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్

పాఠశాలల్లో అన్ని వసతులు


కట్టంగూర్ : రామచంద్రాపురం పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నార్కట్‌పల్లి, కట్టంగూర్ : రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తోందని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం నార్కట్‌పల్లి, ఎల్లారెడ్డిగూడెం, కట్టంగూర్ మండలంలోని రామచంద్రాపురం, గార్లబాయిగూడెం ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. రామచంద్రాపురం పాఠశాల వంటగదిలోనే అంగన్‌వాడీ కేంద్రం నిర్వహించడాన్ని కలెక్టర్ గమనించి ప్రత్యేక వంట గదికి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం 'మన ఊరు–మన బడి, మన బస్తీ –మన బడి' కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులు కల్పిస్తోందన్నారు. విద్యార్థులకు మంచి వాతవరణంలో మెరుగైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం నార్కట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి పోర్టల్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్, దరఖాస్తులు, పరిష్కారంతో పాటు సమస్యలపై, ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో లెబర్ టర్నోవర్, బృహత్ పల్లె పకృతి వనాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలపై సమీక్షించారు. ఏపీ లింగోటంలో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు యాదయ్య, సునీత, తహసీల్దార్లు సైదులు, దేశ్యా ఎంఈఓ నర్సింహ తదితరులున్నారు.

సాగర్‌ను సందర్శించిన హిస్టరీ విద్యార్థినులు

నాగార్జునసాగర్ : సాగర్ జలాశయ తీరంలోని బుద్ధవనాన్ని హైదరాబాద్‌కు చెందిన రాజబహదూర్ వెంకట్రామిరెడ్డి మహిళా కళాశాల హిస్టరీ విద్యార్థినులు ప్రొఫెసర్ డాక్టర్ హేమాసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బుధవారం సందర్శించారు. వీరికి బుద్ధవనం డిజైన్ ఇన్‌చార్జ్ శ్యాంసుందర్‌రావు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. విద్యార్థులు బుద్ధుడి పదాలవద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం బుద్ధ చరితవనం, జాతక వనం, స్థూపవనం, ధ్యాన వనం తదితర ప్రాంతాలను సందర్శించారు. మహాస్థూపంపై చెక్కిన శిల్పాల వివరాలను సేకరించారు. మహాస్థూపంలోని సమావేశ మందిరంలో ధ్యానం చేశారు. అనంతరం లాంచీలో నాగార్జున కొండకు వెళ్లి అక్కడ మ్యూజియాన్ని సందర్శించారు. వీరితో పాటు ఫ్యాకల్టీ అనూషా ఉన్నారు.


బుద్ధవనంలో విద్యార్థినులు

నల్లగొండలో నిలిచిన రైళ్లు

- అవస్థలు పడిన ప్రయాణికులు
- ఆరు బస్సుల్లో హైదరాబాద్‌కు పంపిన రైల్వే అధికారులు


నల్లగొండ రైల్వే స్టేషన్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

నల్లగొండ రూరల్ : బీబీనగర్ – ఘట్‌కేసర్ మధ్య బుధవారం తెల్లవారుజామున గోదావరి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నల్లగొండ రైల్వే స్టేషన్‌లో ఉదయం 10 గంటలకు వచ్చిన హౌరా – సికింద్రాబాద్, వికారాబాద్– గుంటూర్ రైళ్లు సాయంత్రం 5 గంటల వరకు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 800 మందికి పైగా ప్రయాణికులు వివిధ మార్గాల ద్వారా గమ్యస్థానాలకు వెళ్లిపోయారు. 463 మంది ప్రయాణికులను రైల్వే అధికారులు ఆరు బస్సుల ద్వారా హైదరాబాద్‌కు చేర్చారు.

పలు రైళ్లు రద్దు

ఈ మార్గంలో రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేశారు. డెమో పుష్‌పుల్, చెన్నై ఎక్స్‌ప్రెస్, రేపల్లె ట్రైన్ రాకపోకలను, విశాఖ – లింగంపల్లి జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను, నడికుడి – కాచిగూడ స్పెషల్ ట్రైన్ రద్దు చేశారు. నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్, చెన్నై ఎక్స్‌ప్రెస్‌లను దారి మళ్లించారు.

ప్రయాణికుల అవస్థలు

నల్లగొండ రైల్వే స్టేషన్‌లో రెండు రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టాయిలెట్స్‌కు తాళం వేసి ఉండడం, రెస్టారూంలో టాయిలెట్స్ ఉన్నట్లు ప్రయాణికులకు తెలియకపోవడంతో అసౌకర్యానికి గురయ్యారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద లిఫ్టు పనులు చేస్తుండడంతో ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం వైపు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో తాగునీటి కోసం ప్రయాణికులు అల్లాడారు.

రెండు గంటల పాటు నిలిచిన రైలు

చిట్యాల : చిట్యాల పట్టణ శివారులోని రైల్వేస్టేషన్‌లో పూణే–భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ రెండు గంటల పాటు నిలిపివేశారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రైలును రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. అనంతరం ఆ రైలు రామన్నపేట రైల్వేస్టేషన్‌కు వెళ్లిపోయింది.

ప్రకృతి క్షేత్రంలో ఐదు రాష్ట్రాల అధికారులు


వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నల్లగొండ అగ్రికల్చర్ : నల్లగొండ సమీపంలోని చర్లపల్లి వద్ద గల ఎదుల్ల అంజిరెడ్డి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ, విత్తన ధ్రువీకరణ సంస్థల అధికారులు సందర్శించారు. ఎరువులు, రసాయనాలు, పురుగు మందులు, కలుపు మందులు లేకుండా సహజ సిద్ధంగా పండిస్తున్న వివిధ పండ్లు, కూరగాయల మొక్కలను పరిశీలించి సాగు పద్ధతులను అంజిరెడ్డిని అడిగి తెలుసుకుని అభినందించారు. తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

- ప్రభుత్వ పాఠశాలలకు రూ.46.26 లక్షలు విడుదల చేసిన ప్రభుత్వం
- 34 రోజులకు సరిపడా నిధులు మంజూరు
- ఎస్ఎంసీల ఖాతాలో జమ చేసిన అధికారులు


అల్పాహారం అందజేస్తున్న ఉపాధ్యాయుడు

నల్లగొండ : ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించే సమయంలో ప్రభుత్వం అల్పాహారం అందజేస్తోంది. ఇందుకోసం జిల్లాకు రూ.34 లక్షలు విడుదల చేసింది. ఈ నిధులను ఎస్ఎంసీల ఖాతాల్లో జమచేసింది. ప్రతి విద్యార్థికి రోజుకు రూ.15 చొప్పున ఖర్చు చేసి స్నాక్స్ అందించనున్నారు. ఇందుకు కోసం ప్రత్యేక మెనూ సైతం తయారు చేశారు. ఈ కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభమైంది.

9,072 మంది పదో తరగతి విద్యార్థులకు..

జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్ స్కూళ్లలో మొత్తం 246 పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులు 9,072 మంది ఉన్నారు. వారందరికీ పాఠశాల సమయం పూర్తయ్యాక ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో ఉదయం 8 గంటలకే విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారు. మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే చేస్తున్నారు. సాయంత్రం 4.30 గంటలకు పాఠశాల ముగిశాక 6, 7 గంటల వరకు ప్రత్యేక తరగతులు వింటున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రత్యేక తరగతుల సమయంలో విద్యార్థులకు అల్పాహారం అందజేసేందుకు చేసేందుకు రూ.46,26,720 విడుదల చేసింది. ఈ నిధులను ఆయా పాఠశాల స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఖాతాల్లో జమ చేసింది. ప్రభుత్వం మొదటిసారిగా అల్పాహారం కోసం నిధులు మంజూరు చేయడంతో విద్యార్థుల్లో ఆనందం నెలకొంది.

మెనూ ఇలా..

సోమవారం:	టమాటబాత్, గోధుమ రవ్వ ఉప్మా, బొంబాయి రవ్వ ఉప్మా
మంగళవారం:	పండ్లు
బుధవారం:	శనగ గుగ్గిళ్లు (100 గ్రా.)
గురువారం:	పులిహోర
శుక్రవారం:	ఉడకబెట్టిన పల్లీలు (100గ్రా.)
శనివారం:	పల్లీపట్టి, నువ్వుల పట్టీ(4)

అల్పాహారానికి నిధులు మంజూరు



ఈ సంవత్సరం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల సమయంలో ఆకలితో ఇబ్బందులు పడకుండా పౌష్టికాహారం అందించేందుకు నిధులు మంజూరయ్యాయి. ఎస్ఎంసీలు మధ్యాహ్న భోజన ఏజెన్సీల ద్వారా విద్యార్థులకు అల్పాహారం అందజేయాలి.
– భిక్షపతి, డీఈఓ

పౌష్టికాహారం అందించడం ఆనందం



పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నందున పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం ఇంటికి వెళ్లే వరకు చాలా ఆలస్యమవుతుంది. ఆ సమయంలో ఆకలి అయ్యేంది. ప్రస్తుతం పాఠశాలలో అల్పాహారం అందించడంతో ఆకలి ఇబ్బంది తప్పింది.
– కృష్ణవేణి బొట్టుగూడ స్కూల్ విద్యార్థిని

నీలగిరిలో మురుగుపారే దారేదీ!

- పూర్తిస్థాయిలో లేని యూజీడీ
- వర్షం వస్తే ఇళ్లలోకి చేరుతున్న మురుగు
- సమస్య తీరాలంటే రూ.500 కోట్లు అవసరం
- అమృత్–2లో వచ్చేది రూ.216 కోట్లే..


వసుంధర కాలనీలో ఇళ్ల మధ్య పేరుకుపోయిన మురుగు నీరు

నల్లగొండ టూటౌన్ : పట్టణ జనాభాకు అనుగుణంగా కనీస మౌలిక సదుయాపాల కల్పన లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పెరిగిన అవసరాలకు అనుగుణంగా సౌకర్యాల కల్పనలో అంత వేగం లేకపోవడంతో పట్టణంలోని పలు కాలనీల్లో మురుగు సమస్య జఠిలంగా మారుతోంది. వర్షాకాలం వచ్చిందంటే ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి మురుగు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే పట్టణమంతా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) నిర్మించాల్సిన అవసరం ఉంది. నీలగిరి మున్సిపాలిటీ విస్తీర్ణం 108 కిలో మీటర్లు. పట్టణంలో మొత్తం 600 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ అసవరం ఉండగా కేవలం 200 మీటర్ల యూజీడీ మాత్రమే ఉంది. మిగతా 400 కిలో మీటర్లు యూజీడీ నిర్మాణం చేపడితే మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డుల్లో ఎక్కడ కూడా మురుగు సమస్య ఉండదు. కానీ నిధులు ఎప్పుడు రావాలి.. ఎప్పుడు ఈ సమస్య తీరుతుందో అర్థం కానీ పరిస్థితి ఉంది.

అమృత్–2లో రూ.216 కోట్లు..

అమృత్–2 పథకం కింద నీలగిరి పట్టణం ఎంపికైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమృత్ పనులు చేపట్టనున్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ దాదాపు 200 కిలోమీటర్లు వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అమృత్ –2 పథకం కింద నీలగిరి పట్టణానికి రూ.216 కోట్లు మంజూరయ్యాయి. కానీ నిధులు మాత్రం విడుదల చేయలేదు. మరో మూడు, నాలుగు నెలల్లో ఈ పథకం కింద నిధులు విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నిధులతో 200 కిలోమీటర్లు పూర్తయినా.. మిగతా 200 కిలో మీటర్లు మిగిలే ఉంటుంది. విలీన గ్రామాల్లో యూజీడీ కోసం ప్రజాప్రతినిధులు ప్రభుత్వాలపై ఎప్పుడు ఒత్తిడి తెస్తారో.. ఎప్పుడు నిధులు విడుదల చేయిస్తారో వేచి చూడాల్సిందే.

రూ.500 కోట్లు వస్తేనే అంతటా యూజీడీ...


సూర్యవంశీ కాలనీలో పారుతున్న మురుగు

నీలగిరి పట్టణంలో విలీన గ్రామాలతో పాటు, పాత పట్టణంలో కూడా పూర్తి స్థాయిలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం లేదు. మొత్తం 400 కిలో మీటర్లు యూజీడీ నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. కానీ 400 కిలో మీటర్ల యూజీడీ నిర్మాణం చేపట్టాలంటే దాదాపు రూ.500 కోట్లు అయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గంధంవారిగూడెం, మామిళ్లగూడెం, చర్లపల్లి, కేశరాజుపల్లి, ఆర్జాలబావి, మర్రిగూడ విలీన గ్రామ పంచాయతీలు, వాటి ఆవాసా గ్రామాలు, పానగల్‌లో కొంతబాగం, పానగల్ రోడ్డులో 18, 19వ వార్డులు, పాత బస్తీలో కొంత భాగం, మహిళా ప్రాంగణం, ముషంపల్లి రోడ్డు, ఇటీవల కొత్తగా వెలిసిన పలు కాలనీల్లో యూజీడీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో మురుగు నీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని.. పలుమార్లు పాలకవర్గ సభ్యులు సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. కానీ ప్రభుత్వాల నుంచి నిధులు ఇస్తేనే పట్టణమంతా యూజీడీ నిర్మాణం సాధ్యమయ్యే అవకాశం ఉంది.

క్లుప్తంగా

గీత కార్మికుడికి గాయాలు



చికిత్స పొందుతున్న గీత కార్మికుడు రవి

యాదగిరిగుట్ట రూరల్ : తాటిచెట్టు పైనుంచి జారిపడి గీతాకార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని వంగపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుండ్లపల్లి రవి రోజులాగే ఉదయం తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని భువనగిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

వ్యక్తిపై హత్య కేసు నమోదు

ఆత్మకూరు (ఎస్)(సూర్యాపేట) : మండల పరిధిలోని ఏపూరి గ్రామంలో మంగళవారం జరిగిన వీరస్వామిని అదే గ్రామానికి చెందిన గుండ్లపల్లి నరసయ్య హత్య చేశాడని హతుడి భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు. వీరస్వామి తన భార్యతో సన్నిహితంగా మెలుగుతున్నాడనే అనుమానంతోనే నరసయ్య ఘాతుకానికి ఒడిగట్టాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



యల్లమ్మ (ఫైల్)

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : గుండెపోటుతో ఉపాధి కూలీ మృతిచెందింది. ఈ ఘటన మండల పరిధిలోని ఏపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రావుల యల్లమ్మ (48) రోజూ మాదిరిగానే ఉపాధి హామీ పనికి వెళ్లి అస్వస్థత గురైంది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు చెప్పారని గ్రామస్తులు తెలిపారు. మృతురాలు యల్లమ్మకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ఆమె మతదేహాన్ని ఏపీవో ఈశ్వర్ సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఏపూర్ గ్రామ సర్పంచ్ సానబోయిన రజిత సుధాకర్, ఉప సర్పంచ్ అవిరే పద్మ అప్పయ్య, వార్డు సభ్యులు కారింగుల లింగయ్య, శోభ ఉన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి



బొమ్మగాని లింగయ్య మృతదేహం

శాలిగౌరారం: తాటిచెట్టు పైనుంచి పడి ఓ గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని ఊట్కూరు గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఊట్కూరు గ్రామానికి చెందిన బొమ్మగాని లింగయ్య(62) రోజువారీ మాదిరిగానే కల్లుగీసేందుకని సాయంత్రం గ్రామ సమీపంలోని తాటిచెట్లను ఎక్కేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఓ తాటిచెట్టును ఎక్కిన లింగయ్య ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వచ్చి చూసే సరికి అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం



ప్రమాదానికి కారణమైన ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు



రోడ్డుపై బోల్తాపడిన కట్టెల లోడు ట్రాక్టర్

- మరో ముగ్గురికి గాయాలు

చిట్యాల: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. రామన్నపేట మండల కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన మచ్చ వెంకటేశం(42)చిట్యాల మండలం అరెగూడెం గ్రామం నుంచి బుధవారం తెల్లవారుజామున ట్రాక్టర్ ట్రాలీలో కట్టెల లోడుతో చౌటుప్పల్‌కు వెళ్తున్నాడు. చిట్యాల మండలంలోని వెలిమినేడు శివారులోకి వెళ్లగానే విజయవాడ వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు అతివేగంగా ట్రాక్టర్‌ను వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మచ్చ వెంకటేశం అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేశం మృతదేహం కట్టెల లోడు కింద ఇరుక్కుపోయింది.



మచ్చ వెంకటేశం (ఫైల్)

పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీశారు. కాగా, బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ ఢీకొని యువకుడు..



అశోక్‌కుమార్(ఫైల్)

నార్కట్‌పల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం ఏఎస్ కాలనీకి చెందిన దోన్న అశోక్‌కుమార్(30) నల్లగొండలోని కేఎఫ్‌సీలో బ్రాంచ్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. పని నిమిత్తం మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ పని ముగిసిన తర్వాత బుధవారం బైక్‌పై నల్లగొండకు బయలుదేరాడు. మార్గమధ్యలో నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నల్లగొండ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అశోక్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదం అనంతరం లారీ ఆపకుండా వెళ్లడంతో పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించారు. లారీని, డ్రైవర్‌ను వాడపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో పట్టుకుని నార్కట్‌పల్లి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

సంతానం కలగడం లేదని..

- పురుగుల మందు తాగిన కానిస్టేబుల్
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



మధుబాబు (ఫైల్)

చివ్వెంల(సూర్యాపేట) : సంతానం కలగడం లేదని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కానిస్టేబల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దొడ్డి మధుబాబు (39) చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఇతడికి 2012వ సంవత్సరంలో అవని కుమారితో వివాహం కాగా సంతానం కలగలేదు. ఈ నేపథ్యంలోనే మనస్తాపానికి గురైన మధుబాబు ఈనెల 7న సూర్యాపేటలో పురుగుల మందు కొనుగోలు చేసి తాగాడు. అనంతరం ఇంటికి చేరుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు అతడిని సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు మణికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపారు.

యూకలిప్టస్, తాటి చెట్లు దగ్ధం



మంటలతో కాలిపోయిన చెట్లు

మోటకొండూర్: ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని 35ఎకరాల అరకు(యూకలిప్టస్) చెట్లు, రెండు వందలకు పైగా తాటి చెట్లు కాలిపోయాయి. ఈ ఘటన మండలంలోని కాటేపల్లి శివారులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తి వేసిన సిగరేట్ పీక గడ్డికి అంటుకుని మంటలు లేచాయి. అవి క్రమంగా వ్యాపించి కాటేపల్లి-ముస్త్యాలపల్లి శివారులో 35 ఎకరాల అరకు చెట్లు, రెండు వందలకు పైగా తాటి చెట్లకు అంటుకోవడంతో కాలిపోయాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు.

డిండి సీఐని సస్పెండ్ చేయాలని ధర్నా



దేవరకొండ డీఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దేవరకొండ: భూ సంబంధిత విషయంలో జోక్యం చేసుకొని మహిళపై దురుసుగా ప్రవర్తించిన డిండి సీఐ పరశురాంను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం దేవరకొండ డీఎస్పీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండలం ఎర్రారం గ్రామానికి చెందిన మావిళ్ల మల్లయ్య, మావిళ్ల చిన్న జంగయ్య మధ్య కొంత కాలంగా భూమి పంచాయితీ నడుస్తుంది. ఇదిలా ఉంటే సీఐ పరశురాం బుధవారం దేవరకొండలోని సర్కిల్ కార్యాలయానికి మల్లయ్య కుటుంబ సభ్యులను పిలిపించి దురుసుగా ప్రవర్తించాడని, అక్కడే ఉన్న మల్లయ్య బంధువైన వరమ్మపై చేయి చేసుకున్నాడని వారు ఆరోపించారు. విషయం తెలుసుకున్న దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి డీఎస్పీ కార్యాలయానికి చేరుకొని ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా బాలూనాయక్ మాట్లాడుతూ.. సీఐపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ నాగేశ్వర్‌రావు కాంగ్రెస్ నాయకులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ధర్నా విరమించలేదు. బాలూనాయక్ జిల్లా ఎస్పీ అపూర్వరావుతో ఫోన్‌లో మాట్లాడి సీఐపై చర్యలు తీసుకోవాలని కోరగా, ఆమె విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ధర్నాలో నాయకులు దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి, నేనావత్ కిషన్‌నాయక్, బీల్యానాయక్, సిరాజ్‌ఖాన్, రవినాయక్, రేఖశ్రీధర్ రెడ్డి, మాధవరెడ్డి, రుక్మారెడ్డి పాల్గొన్నారు.

వేదామృతం పేరుపై రాద్ధాంతం తగదు

- గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ



మాట్లాడుతున్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ

మిర్యాలగూడఅర్బన్: నీరాకు, కల్లుకు తేడా తెలియని బ్రాహ్మణ సంఘాలు వేదామృతం పేరుపై రాద్ధాంతం చేయడం తగదని గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ కంపెనీలు తయారు చేసే కూల్ డ్రింక్స్, మద్యం బాటిళ్లకు ఎలాంటి పేర్లు పెట్టినా అభ్యంతరం చెప్పని బ్రాహ్మణ సంఘాలు నీరాకు వేదామృతం అని పేరు పెడితే అభ్యంతరం తెలపడం సరికాదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న, జిల్లా కార్యదర్శి చౌగాని సీతారాములు, నాయకులు అచ్చాలు, రాచకొండ వెంకట్‌గౌడ్, పుల్లయ్య, శ్రీనివాస్, దుర్గయ్య, సైదులు తదితరులున్నారు.

పోలీస్ అభ్యర్థుల ఈవెంట్స్ షురూ



అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి

- తొలిరోజు 600 మందికి గాను 468 మంది హాజరు

నల్లగొండ క్రైం : పోలీస్ ఉద్యోగాల ఎంపికకు బుధవారం నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజు 600 మంది అభ్యర్థులకు గాను 468 మంది హాజరుకాగా 106 మంది ఎంపికయ్యారు. అభ్యర్థుల అన్ని సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈవెంట్స్‌ను ప్రత్యేక ఎస్పీ శబరీష్, నల్లగొండ ఎస్పీ అపూర్వరావు పర్యవేక్షించారు. ఎండ వేడిమికి అభ్యర్థులు ఇబ్బంది పడకుండా ఉదయం 10గంటల లోపు ఈవెంట్స్ పూర్తయ్యేలా అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ



చోరీకి పాల్పడిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్



గోపయ్య ఇంట్లో దుండగులు తెరిచిన బీరువా

రామగిరి(నల్లగొండ) : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన తిప్పర్తి మండలంలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ సమీపంలోని హ్యాపీ హోమ్స్ నందు తాళం వేసి ఊరికి వెళ్లిన వారి ఇళ్లలోకి దొంగలు చొరబడ్డారు. కాలనీలో ప్లాట్ నంబర్ 34లో ఉంటున్న మాచర్ల శ్రావణ్ ప్రసాద్ 13 తేదీన సాయంత్రం హైదరాబాద్‌కు వెళ్లగా ఇంట్లో ఉంచిన 2.5 తులాల పుస్తెల తాడు, 8 గ్రాములు బంగారం, ల్యాప్‌టాప్, హెచ్‌పీ కలర్‌ప్రింటర్‌ను చోరీ చేశారు. అదే విధంగా ప్లాట్ నంబర్ 212లో ఉంటున్న దర్నెబోయిన శారద 13 తేదీన ఉదయం నాగర్‌కర్నూల్‌లో ఉంటున్న భర్త వద్దకు వెళ్లింది. ఇంట్లో దాచుకున్న 5 గ్రాముల రెండు ఉంగరాలు, 20 తులాల వెండి పట్టా గొలుసులు ఎత్తుకెళ్లారు. అదే కాలనీలో ప్లాట్ నంబర్ 36లో ఉంటున్న బొబ్బ దినకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు 9న హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం ఉదయం ఇంటికి వచ్చే చూసే సరికి ఇంటి తాళం తీసి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా 2 గ్రాములు బంగారు ఉంగరం, 30 తులాల వెండి ఆభరణాలు, ల్యాప్‌టాప్‌తో పాటు రూ. 3 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వీరితో పాటు మరో నాలుగు ఇండ్లలో కూడా చోరీకి ప్రయత్నించారు. మంగళవారం క్లూస్ టీమ్, ఫింగర్ ప్రింట్స్ బృందం వెళ్లి ఆధారాలు సేకరించారు. బాధితుడు బొబ్బల దినకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

దొండపాడులో..

హుజూర్‌నగర్ (చింతలపాలెం): పట్టపగలే దుండగులు తెగబడ్డారు. తాళం వేసిన ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి వస్తువులను అపహరించుకుపోయారు. ఈ ఘటన మండలంలోని దొండపాడులో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పందిటి గోపయ్య స్థానిక తిరుపతమ్మ గుడి వద్ద ఉంటూ సిమెంట్ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం నైట్ డ్యూటీ చేసివచ్చి ఇంటి వద్దనే ఉన్నాడు. భ్యార్య నాగేంద్ర పొలం పనికి వెళ్లింది. 12 గంటల సమయంలో కొడుకును తీసుకువచ్చేందుకు పాఠశాల వద్దకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి బీరువాలోని నాలుగు బంగారపు ఉంగరాలు, దిద్దులు, వెండి పట్టీలను దొంగిలించుకెళ్లారు. బాధితుడి గోపయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగ్గురు బైక్ దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్‌కుమార్



స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న సీఐ

- ఐదు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్ స్వాధీనం

మిర్యాలగూడ అర్బన్: జల్సాలకు అలవాటు పడి బైక్‌లను అపహరిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టూటౌన్ సీఐ నిగిడాల సురేష్ కుమార్ నిందితుల వివరాలు వెల్ల డించారు. మిర్యాలగూడ మండలం దుర్గానగర్‌కు చెందిన అవిరెండ్ల శశి ప్రీతం, పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన పాతులోతు గౌతమ్, బాపూజీనగర్‌కు చెందిన సకినాల మనిదీప్ స్నేహితులు. వీరు చెడు వ్యసనాల బారిన పడి అవసరాలను తీర్చుకునేందుకు బైక్‌లను అపహరిస్తున్నారు. వీరు దామరచర్ల, మిర్యాలగూడ పట్టణాల్లో పార్కింగ్ చేసిన బైక్‌లను గుర్తించి చోరీ చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా పల్సర్ బైక్‌పై ముగ్గురు వ్యక్తులు తారసపడ్డారు. వారిని ఆపాలని కోరగా పారిపోయేందు కు ప్రయత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా పొంతన లేని సమాధానాలు చెప్పారు. దీంతో వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా బైక్‌లను అపహరిస్తున్నట్లు ఒప్పుకున్నారు. ఆరు నెలలుగా ఐదు బైక్‌లను చోరీ చేసినట్లు నేరం అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.1.85లక్షల విలువైన బైక్‌లతో పా టు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కాగా, వీరి లో అవిరెండ్ల శశి ప్రీతం హైదరాబాద్‌లోని నాచారం, కుషాయిగూడ పరిధిలో బైక్ దొంగతనా ల కేసుల్లో జైలుకు సైతం వెళ్లి వచ్చినట్లు సీఐ తెలి పారు. కేసు ఛేదించిన పోలీస్ సిబ్బందిని డీఎస్పీ వెంకటగిరి అభినందించారు. సమావేశంలో ఎస్‌ఐలు కృష్ణ య్య, సైదిరెడ్డి, వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

యాసంగి కొనుగోళ్లకు సన్నద్ధం కావాలి

నల్లగొండ : ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న యాసంగి కొనుగోళ్లకు ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్, సహకార శాఖ, రవాణా శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 5.31 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 13,27,500 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందన్నారు. ఇందులో 10.62 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 2,65,500 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం ఉంటుందని చెప్పారు. ఉత్పత్తి అయిన దాన్యంలో 8 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాలకు వస్తుందన్నారు. ధాన్యం కొనుగోళ్లకు ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలో జిల్లా గ్రామీణ అభివృద్ధి, సహకార శాఖలు జాబితాను పంపించాలని సూచించారు. ఇప్పటికే 70 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని.. ఇంకా అవసరమైన రెండు కోట్ల గన్నీ బ్యాగులను సమకూర్చుకోవాలని పౌర సరఫరాల డీఎంను ఆదేశించారు. సమావేశంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ కాళిందిని, పౌర సరఫరాల డీఎం నాగేశ్వర్‌రావు, డీఏఓ సుచరిత, మార్కెటింగ్ అధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని..

- గడ్డిమందు తాగిన బాలిక
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

ఆత్మకూరు(ఎం): తల్లిదండ్రులు మందలించారని మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆత్మకూరు(ఎం) మండలంలోని కొరటికల్ గ్రామానికి చుఎందిన వనమాల కృష్ణ, వాణి దంపతుల కుమార్తె అశ్విత (17) భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటోంది. ఈ నెల 2వ తేదీన ఇంటికి వచ్చి ఉంటోంది. హాస్టల్‌కు వెళ్లాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలో అదే రోజు ఇంటి వద్దనే గడ్డిమందు తాగింది. వ్యవసాయ బావి వద్దకు వెళ్లి వచ్చిన తల్లిదండ్రులు అపస్మారకస్థితిలో పడి ఉన్న కుమార్తెను సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న అశ్విత మంగళవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

కొండమల్లేపల్లి: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామానికి చెందిన దాసరి సాయి(21) ఇటీవల తల్లిదండ్రులు ఘర్షణ పడుతుండగా మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలోనే ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌కు తరలించగా ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చింతపల్లి : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని గొడుకొండ్ల రిజర్వాయర్ వద్ద బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రమేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేవరకొండ మండలం తాటికోల్ గ్రామానికి చెందిన శ్రీను(27) ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను పది రోజుల క్రితం ఇంటినుంచి వెళ్లిపోయాడు. హైదరాబాద్-నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారి పక్కన గొడుకొండ్ల రిజర్వాయర్ చెట్ల పొదల్లో విగతజీవుడిగా పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనారోగ్య కారణాలతో మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి సోదరుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎరువుల వ్యాపారిపై కేసు

మద్దిరాల : నాసిరకం కలుపు మందు అమ్మి రైతును మోసం చేశాడనే అభియోగం మేరకు బుధవారం ఎరువుల వ్యాపారిపై కేసు నమోదైంది. బాధిత రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన జంబారపు అశోక్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన వేరుశనగ చేనులో కలుపు నివారణకు గత డిసెంబర్‌లో మండల కేంద్రంలోని అన్నదాత ఎరువుల దుకాణంలో ఓ కంపెనీకి చెందిన కలుపు మందు కొనుగోలు చేశాడు. దానిని పిచికారీ చేసినా ఎలాంటి ఫలితం లేదు. దుకాణం యజమానిని సంప్రదిస్తే నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. దీంతో సదరు రైతు డీసీఐసీ కన్వీనర్ చింతమళ్ల గురువయ్యకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా దుకాణం యజమాని పట్టించుకోకపోవడంతో వినియోగదారుల ఫోరంలో పిటిషన్ దాఖలు చేశాడు. కోర్టు ఆదేశాల మేరకు ఎరువుల వ్యాపారిపై కేసు నమోదైనట్లు బాధిత రైతు తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సూర్యాపేట క్రైం : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు అతిగా మద్యం సేవించి బైక్‌పై వేగంగా వచ్చి ఎన్టీఆర్ పార్కు సమీపంలో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారి రాజును ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. అదే వేగంతో వెళ్లిన ప్రభుత్వ వైద్యుడు మరో ద్విచక్రవాహనదారుడిని ఢీకొట్టడంతో అతడి తలకు కూడా గాయాలయ్యాయి. అనంతరం ఆ ప్రభుత్వ వైద్యుడు గాయపడిన వారిని దూషిస్తూ వెళ్లిపోయాడని స్థానికులు తెలిపారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



తలపడుతున్న ఉత్తరాఖండ్, కేరళ జట్లు



పెద్దవూర: దున్న ఇద్దాస్ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా మండలంలోని చింతపల్లిలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి కబడ్డీపోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. బుధవారం సాయంత్రం ఫ్లడ్‌లైట్ల వెలుగులో ఉత్తరాఖండ్ కేరళ జట్లు తలపడ్డాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు మొదట 16 రాష్ట్రాల (మహిళ)జట్లు రాగా బుధవారం మరో నాలుగు జట్లు వచ్చి చేరాయి. 20రాష్ట్రాల జట్లు ఈ ఆటలో పాల్గొంటుండగా చింతపల్లిలో పండుగ వాతావరణం నెలకొన్నది. సాయంత్రానికి చింతపల్లి గ్రామ ప్రజలే కాకుండా చుట్టుపట్టు గ్రామాల ప్రజలు ఆసక్తిగా పోటీలను చూసేందుకు వచ్చారు. తెలంగాణ, కేరళ, సౌత్‌సెంట్రల్ రైల్వే హైదరాబాద్, వెస్ట్‌బెంగాల్, పంజాబ్, ఢిల్లీ, హరియాణా, కర్ణాటక, జార్ఖండ్, జమ్ము కశ్మీర్, ఉత్తరాఖండ్, ఆంధ్రమిషన్, కేరళ-2 తదితర రాష్ట్రాల జట్లు పాల్గొంటున్నట్లు టోర్నమెంట్ కమిటీ చైర్మన్ ఎస్‌కె.అబ్బాస్, కన్వీనర్‌కర్తయ్య, కోకన్వీనర్ భూలోకరావు తెలిపారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

పెన్‌పహాడ్ : గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా లయోలా కళాశాలకు చెందిన బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కోర్సు విద్యార్థులు పంటల సాగుపై అవగాహన కల్పించారు. బుధవారం మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డి. నరేష్, ఎ. కిరణ్, నరేష్, ఆదర్శ్, రైతులు మాధవరావు, జానకిరామయ్య, లింగయ్య, సైదులు, వెంకులు, జోషి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు, కేవీకే శాస్త్రవేత్తలు